నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | బుధవారం 31 జనవరి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD



ప్రస్తుతం కొనుగోళ్లులేక వెలవెలబోతున్న మార్కెట్ యార్డు

కంది రైతుకు కష్టం

# నాడు కళ కళ.. నేడు వెలవెల

## మార్కెట్ యార్డుల్లో కందుల సేకరణ ప్రారంభించని సర్కారు

- పంట చేతికొచ్చి నెల గడుస్తున్నా పట్టింపు కరువు
- తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్న రైతులు
- ఇష్టారాజ్యంగా కొనుగోళ్లు.. నష్టపోతున్న అన్నదాతలు

కుమ్రం భీం ఆసిఫాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ) : కేసీఆర్ పాలనలో కందుల కొనుగోళ్లతో కళకళలాడిన మార్కెట్ యార్డులు.. నేడు వెలవెలబోతున్నాయి. నాటి ప్రభుత్వం పంట చేతికొచ్చేకంటే నెల ముందు నుంచే మార్కెట్ యార్డులను సిద్ధం చేయగా, ప్రస్తుత సర్కారు పట్టింపులేనట్లుగా వ్యవహరిస్తున్నది. ఈ ఏడాది 40 వేల ఎకరాల్లో కంది సాగు చేయగా, 45 వేల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని యంత్రాంగం అంచనా వేసింది. కోతలు పూర్తయి నెల గడుస్తున్నా.. కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో రైతాంగం తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నది. ఇక ఇదే అదనుగా భావిస్తున్న దళారులు ఇష్టానుసారంగా కొనుగోళ్లు చేపడుతూ అన్నదాతలకు నష్టం చేస్తున్నట్లు తెలుస్తున్నది. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాలుకు ధర రూ. 10 వేలకు పైనే పలుకుతున్నది. కాగా, కందుల కొనుగోళ్లు ఎందుకు ప్రారంభించడం లేదంటూ సోమవారం జరిగిన జడ్పీ సమావేశంలో అధికారులను ప్రశ్నించగా, సమాధానం దాటవేశారు.



వెలవెలబోతున్న మార్కెట్



కేసీఆర్ ప్రభుత్వంలో కందుల కొనుగోళ్లతో కళకళలాడుతున్న మార్కెట్ యార్డు(ఫైల్)

## జంగోలింగో పాటల సీడీ ఆవిష్కరణ



జంగోలింగో పాటల సీడీని ఆవిష్కరిస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవ్‌రావ్

జైనూర్, జనవరి 30 : మండలంలోని జంగావ్‌లో జంగుబాయి పాటల సీడీని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కనక యాదవ్‌రావ్ మంగళవారం ఆవిష్కరించారు. కుమ్ర మాన్కుబాయి పొలంలో కొలువుదీరిన జంగుబాయికి ప్రత్యేక పూజలు చేశారు. సంస్కృతీ సంప్రదాయాల నడుమ హోమ కార్యక్రమం నిర్వహించారు. జంగోలింగో దీక్ష తీసుకున్న స్వాములు నియమ నిష్టలతో పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కుమ్ర శ్యామ్‌రావు, తుడుం దెబ్బ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు పుర్క బాపురావ్, ఆదిలాబాద్ జిల్లా మహిళా సంఘం ప్రధాన కార్యదర్శి పెందోర్ పుష్పారాణి, పెందూర్ అర్జున్, కళాకారుడు రాజేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

# పార్లమెంట్ ఎన్నికల్లోపే ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి

## ఎన్నికల కోడ్ పేరిట తప్పించుకునే యత్నం చేస్తే పోరాటం తప్పదు

- కేసీఆరే తెలంగాణకు శ్రీరామ రక్ష
- ప్రజాదర్బార్ తర్వాత పత్తాలేని సీఎం రేవంత్
- దావోస్‌లో వచ్చీరాని ఇంగ్లిష్‌తో తెలంగాణ పరువు తీసిండు
- సింగరేణిని కాపాడుకోవాలంటే బీఆర్‌ఎస్ ఎంపీలుండాలి
- మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి
- బెల్లంపల్లిలో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అధ్యక్షతన బీఆర్‌ఎస్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం

బెల్లంపల్లి, జనవరి 30 : కాంగ్రెస్ ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చి గద్దెనెక్కిందని, పార్లమెంట్ ఎన్నికల్లోపే ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని, ఎన్నికల కోడ్ అని చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేస్తే ప్రజల తరఫున పోరాటం చేస్తామని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి స్పష్టం చేశారు. బెల్లంపల్లి పట్టణంలోని పద్మశాలీ భవన్‌లో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన బీఆర్‌ఎస్ నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేసీఆర్ తెలంగాణ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. పార్టీ విషయంలో జరిగిన చిన్న పొరపాట్లవల్లే ఎన్నికల్లో ఓడిపోయామన్నారు. ఇది కారు స్పీడ్‌కు జస్ట్ బ్రేక్‌లాంటిదేనని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో 1.8 శాతం ఓట్లతో మాత్రమే ఓడిపోయామన్నారు. కార్యకర్తలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీలెప్పుడూ రాష్ట్ర ప్రయోజనాలు కాపాడింది లేదని, తెలంగాణ రాష్ట్రానికి కేసీఆర్, బీఆర్‌ఎస్ పార్టీయే శ్రీరామ రక్ష అని స్పష్టం చేశారు.

### ప్రజాదర్బార్ ఒక్కరోజేనా రేవంత్..

ప్రజాదర్బార్‌లో ఒక్కరోజే అర్జీలు స్వీకరించిన రేవంత్‌రెడ్డి.. ఆపై పత్తా లేకుండా పోయాడని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 50 రోజుల్లో 14 వేల కోట్ల అప్పులు చేసిందని ఆరోపించారు. ప్రజలను కేసీఆర్ కలవడం లేదని పనిగట్టుకుని విషప్రచారం చేసిన కొన్ని మీడియా సంస్థలు ఇప్పుడు ఎందుకు మౌనం వహిస్తున్నాయో అర్థం కావడం లేదన్నారు. రెండు లక్షల రుణ మాఫీ, రైతుభరోసా, రూ.4 వేల ఫించన్ ఇంత వరకు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. నిరుద్యోగ భృతి ఊసే లేదని ఎద్దేవా చేశారు. పైసా ఖర్చు లేని ఉచిత బస్సు పథకాన్ని మాత్రమే కాంగ్రెస్ అమలు చేస్తుందని విమర్శించారు. రాహుల్ గాంధీ జోడో యాత్ర చేస్తుంటే.. ఇండియా కూటమిలోని నాయకులు ఒక్కొక్కరుగా ఛోడో యాత్ర చేస్తున్నారని ఎద్దేవా చేశారు. రైతు భరోసా పథకం ఎక్కడని అడిగిన రైతులను చెప్పుతో కొట్టాలనడం, దాన్ని ప్రశ్నించిన ఇతర పార్టీల నాయకులను పోలీసులతో అరెస్టు చేయించడం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అహంకారానికి నిదర్శనమన్నారు. పెట్టుబడుల కోసం దావోస్ వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి సబ్జెక్ట్ లేకుండా వచ్చీరాని ఇంగ్లిష్ మాట్లాడి తెలంగాణ పరువు తీశారన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి హోదాలో హుందాగా మాట్లాడాలని, గల్లీ లీడర్‌లా మాట్లాడొద్దని హితవు పలికారు. బీఆర్‌ఎస్ పార్టీని బొందపెట్టేటోడు ఇంకా పుట్టలేదని స్పష్టం చేశారు. కార్యకర్తలు భయపడాల్సిన అవసరం లేదని, పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు దాడులు చేస్తే ఊరుకోబోమని, ప్రతిదాడులు చేస్తామని హెచ్చరించారు.

### సింగరేణిపై మోదీ, అదానీ కుట్ర

ప్రధాని నరేంద్ర మోదీ, ఆయన దోస్తు అదానీల కన్ను సింగరేణిపై పడిందని, సింగరేణి బొగ్గు బ్లాక్‌లను అదానీకి కట్టబెట్టడానికి పెద్ద ఎత్తున కుట్ర జరుగుతోందని ప్రశాంత్‌రెడ్డి స్పష్టం చేశారు. సంస్థను కాపాడుకోవాలంటే బీఆర్‌ఎస్ ఎంపీలనే గెలిపించాలని స్పష్టం చేశారు. పార్లమెంట్‌తో తెలంగాణ గళం వినిపించాలంటే బీఆర్‌ఎస్ ఎంపీలు గెలవాల్సిన ఆవశ్యకత ఎంతైనా అవసరం ఉందన్నారు. ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ అబద్ధపు ప్రచారాలతోనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. కాంగ్రెస్ గద్దెనెక్కినంక జైతెలంగాణ అనే పదమే కనుమరుగైందని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ నేతృత్వంలో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య బెల్లంపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని వెల్లడించారు. సింగరేణి స్థలాలకు పట్టాలు ఇచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కేసీఆర్ పుట్టినరోజును పురస్కరించుకొని ఫిబ్రవరి 15, 16, 17 తేదీల్లో క్రీడాపోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పదవీ కాలం ముగుస్తున్న సర్పంచ్‌లను ఘనంగా సత్కరించారు. సమావేశంలో మాజీ మంత్రి బోడ జనార్దన్, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్, మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, జడ్పీ వైస్ చైర్మన్ తొంగల సత్యనారాయణ, నియోజకవర్గంలోని ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న బొమ్మల కొలువు



బొమ్మల కొలువులో సీఎండీ సతీమణి, ఇతర అధికారుల భార్యలు

సీసీసీ నస్పూర్, జనవరి 30 : సీసీసీలోని ఇల్లందు క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన బొమ్మల కొలువు ఆకట్టుకున్నది. లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు రాధాకుమారిసంజీవరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ బొమ్మల కొలువుకు సీఎండీ బలరాం సతీమణి శారద, డైరెక్టర్లు సత్యనారాయణ సతీమణి హరిణి, ఎన్వీకే శ్రీనివాస్ సతీమణి కల్యాణి హాజరయ్యారు. బొమ్మల కొలువు సందర్భంగా ఇల్లెందు క్లబ్‌లో అయోధ్య రామ మందిరం, సమ్మక్క-సారలమ్మ వనదేవతలు, పర్ణశాల, బృందావనాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సీతారాముని వేషధారణలో మహిళలు చేసిన నృత్య ప్రదర్శన, శివుని వేషధారణలో చేసిన శివతాండవం అలరించింది. బొమ్మల కొలువును వైభవంగా నిర్వహించిన లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు రాధాకుమారిని సీఎండీ సతీమణి శారద అభినందించారు. ఈ కార్యక్రమంలో అధికారుల సతీమణులు సుధ, సువిత, భవాని, లలిత, లేడీస్ క్లబ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## భైరవ దేవునికి జాయింట్ కలెక్టర్ పూజలు



భైరవ దేవునికి పూజలు చేస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

కోటపల్లి, జనవరి 30 : మండలంలోని పారుపల్లి గ్రామ సమీపంలో వెలసిన భైరవ దేవుడికి జయశంకర్ భూపాలపల్లి జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. జాయింట్ కలెక్టర్‌ను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహదేవాపూర్ ఎంపీడీవో ఏలేశ్వర్ రవీంద్రనాథ్ చారి, భక్తులు పాల్గొన్నారు.

# పల్లెల ప్రగతికే కొత్త జీపీలు

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి
- మూడు గ్రామాల్లో పంచాయతీ భవనాలు ప్రారంభం

ఆసిఫాబాద్ టౌన్, జనవరి 30 : పల్లెల ప్రగతికే బీఆర్‌ఎస్ ప్రభుత్వం కొత్త గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసిందని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని చిలాటిగూడ, గోవింద్‌పూర్, కౌటగూడలో నూతన పంచాయతీ భవనాలను అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, ఆయా గ్రామాల సర్పంచులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు పాలన చేరువ చేసేందుకే కొత్తగా గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేశామన్నారు. సర్పంచులు, కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ రావు, ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గాదివేణి మల్లేశ్ యాదవ్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, సర్పంచులు మహేశ్,క త్లే గంగుబాయి, లక్ష్మీనారాయణ, కార్యదర్శి సుమలత తదితరులు పాల్గొన్నారు.



గోవింద్‌పూర్‌లో పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

## ప్రాక్టికల్స్ పకడ్బందీగా నిర్వహించాలి

మంచిర్యాల అర్బన్, జనవరి 30 : జిల్లాలోని 36 ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి జరిగే ఇంటర్ ప్రాక్టికల్స్‌ను పకడ్బందీగా నిర్వహించాలని డీఐఈవో, ఇంటర్మీడియట్ జిల్లా పరీక్షల కమిటీ (డెక్) కన్వీనర్ శైలజ అన్నారు. మంగళవారం ఐడీవోసీ మీటింగ్ హాలులో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ప్రాక్టికల్స్‌కు సంబంధించి నిర్వహించిన సన్నాహక సమావేశంలో డీఐఈవో మాట్లాడారు. ప్రాక్టికల్స్‌కు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశారో! లేదో! పరీక్షించాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలుండేలా చూడాలని సీఎస్, డీవోలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డెక్ సభ్యులు సీహెచ్ శరత్‌కుమార్, ఎన్ పద్మ, జిల్లాలోని వివిధ కళాశాలల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఐఈవో శైలజ

## హెల్మెట్ తప్పనిసరి



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీటీవో లెక్కల కిష్టయ్య

మంచిర్యాల ఏసీసీ, జనవరి 30 : ద్విచక్ర వాహనదారులంతా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని మంచిర్యాల జిల్లా రవాణాశాఖ అధికారి లెక్కల కిష్టయ్య అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలో హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీని ఎంవీఐ రాహుల్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ, మద్యం సేవించి రోడ్డు ప్రయాణం చేయకూడదని, రోడ్డు నియమ నిబంధనలు పాటించాలని వారు సూచించారు. ఈ సందర్భంగా సుమారు 50 మంది ప్రయాణికులు, సిబ్బంది హెల్మెట్ ధరించి జిల్లా కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కానిస్టేబుళ్లు, హోంగార్డులు, సిబ్బంది పాల్గొన్నారు.



అడవుల సంరక్షణపై ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

# వన్యప్రాణులు, అడవుల రక్షణకు సహకరించాలి

- డీఎఫ్‌వో నీరజ్‌కుమార్
- చిన్నసిద్ధాపూర్‌లో అవగాహన సదస్సు

బెజ్జూర్, జనవరి 30 : అటవీ పరిసర గ్రామాల ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, అడవులు, వన్య ప్రాణుల సంరక్షణకు సహకరించాలని డీఎఫ్‌వో నీరజ్ కుమార్ అన్నారు. మంగళవారం చిన్నసిద్ధాపూర్‌లో బెజ్జూర్ రేంజ్ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అటవీ పరిసర గ్రామాల ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వన్యప్రాణుల వల్ల పంటలు పాడవుతున్నాయని, వంట కోసం ఎండు కట్టెలు తీసుకు రావడానికి అధికారులు అనుమతించాలని, గిరి వికాస్‌లో భాగంగా కరెంట్ సరఫరాకు అనుమతివ్వాలని, తదితర సమస్యలను ప్రజలు డీఎఫ్‌వో దృష్టికి తీసుకెళ్లారు. సదరు సమస్యలపై స్పందించిన డీఎఫ్‌వో తమ పరిధిలో గల సమస్యలతో పాటు అటవీ చట్టం పరిధికి లోబడి ఉన్న సమస్యలను కచ్చితంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రైతులు వీలైనంత వరకు కేంద్ర ప్రభుత్వ ఫసల్ బీమా యోజన పథకంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ విషయంలో పైలెట్ ప్రాజెక్టు కింద ఎమ్మెల్యే ఫండ్ నుంచి రైతులకు పరిహారం ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు. గిరిజనేతరులకు పోడు పట్టాలు ఇవ్వడం అటవీ చట్టంలో లేనందున అది సాధ్యం కాదన్నారు. ఎండు కట్టెల కోసం వెళ్లేవారికి షరతులతో కూడిన అనుమతులు ఇవ్వాలని రేంజ్ అధికారి దయాకర్‌ను ఆదేశించారు. విద్యుత్ సరఫరాకు అనుమతి లేదని తేల్చి చెప్పారు. దీనికి బదులుగా సౌరవిద్యుత్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. త్వరలో తునికాకు రాయల్టీ డబ్బులు అందేలా చూస్తామన్నారు. వన్య ప్రాణులకు ఉచ్చులు బిగిస్తే శిక్ష తప్పదని ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు. అనంతరం వన్య ప్రాణులకు హాని తలపెట్టబోమని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రవి, ఎంపీటీసీ ఫర్వీన్ సుల్తానా, ఆర్‌ఐ అచ్చుత్‌రావు, విద్యుత్ అధికారి ఎస్‌ఎల్‌ఐ రాజేశ్వర్, ఏఈవో మీనా, వెటర్నరీ వైద్యాధికారి జితేందర్, ఎఫ్‌ఎస్‌వోలు శ్రీనివాస్, మల్లికార్జున్, ఎఫ్‌బీవోలు పాల్గొన్నారు.



ఆకట్టుకుంటున్న బట్టర్‌ఫ్లై ఆకృతి..



బెల్లంపల్లి చౌరస్తాలో త్రివిధ దళాలకు చెందిన విగ్రహాలు

# కూడళ్లకు కొత్తందాలు

మంచిర్యాల టౌన్, జనవరి 30 : కేసీఆర్ సర్కారు మంజూరు చేసిన రూ. 4 కోట్ల పట్టణ ప్రగతి నిధులతో నిర్మించిన జంక్షన్‌లు ఆకట్టుకుంటున్నాయి. ఐబీ చౌరస్తా నుంచి లక్ష్మీటాకీసు చౌరస్తా వరకు ప్రధాన రహదారిపై నాలుగుచోట్ల ఏర్పాటు చేస్తుండగా, ఇప్పటికే మూడుచోట్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. జనవరి 26న కలెక్టర్ బాదావత్ సంతోష్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఐబీ చౌరస్తాలోని జంక్షన్ పనులు తుది దశకు చేరుకున్నాయి. ప్రతి జంక్షన్ దగ్గర రోడ్డు మధ్యలో వృత్తాకారంలో ఐలాండ్, గ్రీనరీ, విగ్రహాలు, లైటింగ్, ఫౌంటెయిన్‌లు తదితర సుందరీకరణ పనులు చూడముచ్చటగొలుపుతున్నాయి. ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థతో పనిలేకుండా వాహనాలు ముందుకు వెళ్లేలా ఐలాండ్‌లు నిర్మిస్తున్నారు. ఐబీ చౌరస్తాలో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహంతో పలువురు ప్రముఖుల విగ్రహాలను ఏర్పాటుచేయనున్నారు. టీటీడీ కల్యాణ మండపం చౌరస్తా వద్ద ఫౌంటెయిన్‌తో పాటు గ్రీనరీ ఏర్పాటు చేశారు. బెల్లంపల్లి చౌరస్తాలో త్రివిధ దళాలకు సంబంధించిన విగ్రహాలు, జాతీయ పతాకం, దేశభక్తిని చాటే నమూనాలను ఏర్పాటు చేశారు. లక్ష్మీటాకీసు చౌరస్తాలో ప్రకృతికి సంబంధించిన ఆకృతితో ఉన్న పొడవాటి ప్రతిమ, దాని కింద ఆయా కులవృత్తుల వారి నమూనాలను ఏర్పాటు చేశారు. ఈ జంక్షన్‌ల నిర్మాణంతో మంచిర్యాల పట్టణం సరికొత్త శోభసంతరించుకున్నది.



టీటీడీ కల్యాణ మండపం చౌరస్తాలో నిర్మించిన జంక్షన్



లక్ష్మీటాకీసు చౌరస్తాలో..